# లోక విద్య ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-2, సంచిక-4 15 ఫిబ్రవరి - 2015 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## ప్రపంచీకరణ అనే సవాలుకు స్థానిక వ్యాపారం ఒక సమాధానం

స్థానిక వ్యాపారం అన్న ఆలోచన దోపిడీ రహిత సమాజాన్ని సృష్టించాలన్న భావజాలంలో ఒక అంతర్భాగం. గృహ మరియు అసంఖ్యాకమైన చిన్న సముదాయాలలోని ఉత్పత్తిని స్థానికంగానే అమ్ముకోగలిగే పరిస్థితి వస్తే, గ్రామీణుల, స్థానిక నివాసుల శ్రేయస్సు, సంతోషాల విషయంలో ఎలాంటి సందేహం ఉండదు. ఇది కొత్త ఆలోచన కాదు. సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడేందుకు గాంధీజీ, ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు, స్థానిక వినియోగం అనే భావాలకు రూపకల్పన చేశారు. సామ్రాజ్యవాదానికి నూతన రూపమైన ప్రపంచీకరణకు వ్యతిరేకంగా నిర్ణయాత్మకమైన పోరాటానికి ఇదే ఆలోచన స్థానిక వ్యాపారం రూపంలో ఆధారభూతం అయింది. ఉత్పత్తి, పెట్టుబడి, సాంకేతికత, వాణిజ్య రూపాల నిర్వహణలలో పెనుమార్పులు జరుగుతున్న ఈ తరుణంలో, పోరాటాలలో నూతన ఒరవడిని సృష్టించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆర్థిక చర్చల ప్రాముఖ్యత, ఉత్పత్తి సాధనాలపై ఆధిపత్యం నుండి వాణిజ్య రూపాల వైపు మళ్ళింది. సరళీకృత వాణిజ్యం, విదేశీ వ్యాపారం ఇందులో చర్చనీయాంశాలు. రాజ్యపు జోక్యం ద్వారా ప్రజాసంక్షేమం జరగాలన్న భావన అదృశ్యమయ్యి ఆర్థిక బలమే సరైనదనే ఆలోచన ప్రచారం పొందుతోంది. ఈ క్రమంలో వాణిజ్యం ఎలా పునర్నిర్మితమవుతుందంటే, తక్కువ పెట్టుబడి పెట్టే వీధి వ్యాపారులు శిధిలమవుతున్నారు. రైతులు, వృత్తిపనివాళ్ళ అసలు ఆదాయం పడిపోతోంది. ప్రస్తుత రాజ్యజోక్యపు ముఖ్యకార్యం ఏమిటంటే, కొత్త విధానాల ద్వారా, సాయుధ బలగాల ద్వారా ఉద్యమాలను అణచివేసి ప్రాపంచీకరణ త్వరిత గతిన పూర్తయ్యేటట్లు చూడడం. దీనికి అనుకూలంగా విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం ఉన్నట్లుగా కనబడుతోంది. ఈ రాజకీయ విధానాలతో ఎటువంటి నిరసనలు, ప్రతిఘటనలు జరుగుతున్న దాఖలాలు కనబడట్లేదు. ఈ విధానానికి వ్యతిరేకంగా రైతులు, వృత్తిపనివాళ్ళ సంస్థల నిరసనలు చెదురుమదురుగా జరుగుతూ ఉన్నాయి. స్థానిక వ్యాపారం అన్న ఆలోచన ప్రాపంచీకరణకు వ్యతిరేకంగా ఒక క్రమబద్ధీకరింపబడిన సుదీర్ఘ పోరాటానికి ఆధారమవుతున్నదని "లోకవిద్యజనాందోళన" విశ్వసిస్తోంది.

"స్థానిక వ్యాపారం"తో పాటుగా "లోకవిద్య, కుటీరపరిశ్రమ, స్వదేశీ సమాజం" అనే భావనలు కూడా దోపిడీ రహిత సమాజాన్ని నిర్మించే పోరాటానికి ఆధారంగా రూపొందుతున్నాయి. గడచిన వందేళ్ళలో జరిగిన రాజకీయ, సాంఘిక అభివృద్ధి "మార్క్స", "గాంధీజీ"ల మధ్య వ్యత్యాసాలను చెరిపేస్తూ వారిరువురి కలలను ఒకే సమావేశ ప్రాంగణానికి తీసుకువస్తున్నాయి. ఆర్థికవ్యవస్థలోని విభిన్న అంతర్భాగాలలో జరుగుతున్న మార్పులను విశ్లేషణచేయడం ద్వారా ఇది అర్థమవుతుంది. ఇంకా ప్రాథమికమైన సాంఘిక మార్పుల ప్రక్రియలో స్థానికవ్యాపారం పాత్రను కూడా అటువంటి విశ్లేషణ ద్వారా అర్థంచేసుకోవచ్చు. ఈ వ్యాసంలోని ప్రధాన విషయం ఇదే.

### I. ప్రపంచీకరణ

ప్రపంచంలోను, మన సమాజంలోను జరుగుతున్న మార్పులను అర్థం చేసుకోవాలంటే మన చర్చను ఆరు శీర్షికల క్రింద నిర్వహించుకోవాలి. అవి : పెట్టుబడి, ఉత్పత్తి ప్రమాణాలు, వాణిజ్యం, సాంకేతికత, వనరులు, ఉత్పత్తి వర్గాలు.

1. **పెట్టుబడి** : పెట్టుబడులన్నింటిలో అత్యధిక ప్రధాన రూపంగా ఈరోజు ఆర్థిక పెట్టుబడి మారుతోంది. ఏ సమయంలో తీసుకున్నా సరే మన సమాజంలో అనేక రకాల పెట్టుబడులుండవచ్చు. వీటిలో అత్యంత ముఖ్యమైనవి : పారిశ్రామిక పెట్టుబడి (ఉత్పత్తి శక్తులు, యంత్రాలు) మరియు ఆర్థిక పెట్టుబడి. పారిశ్రామిక విప్లవం తరువాత, ఐరోపాలో, పారిశ్రామిక పెట్టుబడి ఒక్కటే రాజ్యం ఏలింది. ఈ పెట్టుబడి యొక్క యజమానులను "పెట్టుబడిదారులు" అని పిలిచేవారు. కార్ల్ మార్క్స మాటల్లో దోపిడీకి వీరే ఆధారం, ఈ పెట్టుబడి వ్యక్తిగత యాజమాన్యంలోనే చూశాడు కాబట్టి విప్లవం ద్వారా పెట్టుబడి సామాజీకరణ (సామాజిక యాజమాన్యం) చేయడంలోనే దీనికి విముక్తి మార్గం కనబడ్డది. పెట్టుబడిదారీ విధానంలో, ఈ పెట్టుబడి మొదట గుత్తాధిపత్య పెట్టుబడిగాను, తరువాత ఆర్థిక పెట్టుబడిగాను రూపాంతరం చెందింది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత, ఐరోపాలో ఆర్థిక పెట్టుబడి విస్తృతంగా వ్యాపించింది. బ్యాంకుల, ఆర్థిక సంస్థల అభివృద్ధి దీన్నే సూచిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత, కొత్తగా విముక్తమైన మూడవ ప్రపంచ దేశాలు పారిశ్రామికీకరణ, పాశ్చాత్య సాంకేతికతను దత్తత చేసుకొన్నాయి. పారిశ్రామిక పెట్టుబడికి ఇది కొత్త ఊపిరి పోసింది.

యాభైసంవత్సరాల తరువాత ఈ శకం ముగిసినట్టుగా కనిపిస్తోంది. భారతదేశం వంటి దేశాలలో కూడా పారిశ్రామిక పెట్టుబడి మీద ఆర్థిక పెట్టుబడి యొక్క అనివార్యమైన ప్రాబల్యాన్ని చూడవచ్చు. అతిపెద్ద కార్పొరేషన్ల నుండి గృహ ఆధారిత సముదాయాల వరకు అన్ని పరిశ్రమలు-బ్యాంకుల, ఆర్థిక సంస్థల ఋణపెట్టుబడి మీద ఆధారపడి ఉన్నాయి. ప్రభుత్వ, వ్యక్తిగత రూపాలు రెండిటిలోనూ ఆర్థిక పెట్టుబడి ఉంది. పెట్టుబడికి, దానికి మాత్రమే స్వంతమైన గతి నియమాలు గమన సూత్రాలు ఉన్నాయి. రాజ్య యాజమాన్యం ద్వారా దాని గమనం కనుక సంకటంలో పడితే, అది ఇతర ప్రజా, వ్యక్తిగత రూపాలవైపు మళ్ళుతుంది. ఒకవేళ వ్యక్తిగత యాజమాన్యం కనుక దానిని నిలువరిస్తే, అది ఇతర ప్రజారూపాలుగా రూపాంతరం చెందేందుకు ప్రయత్నిస్తుంది. లేకపోతే అది సమాజంలో పెట్టుబడిని ఉంచడానికి వీలైన ప్రజా, వ్యక్తిగత రూపాలకు భిన్నమైన రూపాన్ని సంతరించుకుంటుంది.

ఏ విధంగానైనా పారిశ్రామిక పెట్టుబడి ఆర్థిక పెట్టుబడిగా రూపాంతీకరణ చెందడమనేది ఆర్థికవ్యవస్థ యొక్క అన్ని విభాగాలనీ సుదూర మార్పులకు చేరువయ్యేందుకు వీలుగా తెరచి ఉంచుతోంది. పెట్టుబడిదారుడు తనశక్తిని అనేక రెట్లు పెంచుకుంటూ తన పెట్టుబడి ఏ రూపానికి కట్టుబడకుండా, అదే సమయంలో కూలీల, పనివాళ్ళ శత్రువుగా కనిపించకుండా ఉండే రూపాన్ని సంపాదించాడు. అదే సమయంలో పెట్టుబడి అత్యంత సాధారణమైన, స్పష్టమైన రూపాన్ని సంతరించుకొన్నందున అది దోపిడికి గురయ్యే అన్ని వర్గాలతో ఒకే విధమైన సంబంధాన్ని చూపగలుగుతోంది. ఆ కారణంగా దోపిడీకి గురయ్యే వర్గాల అన్ని శాఖలు, విభాగాలు వారి స్థితి గతుల గురించి ఒకే తత్వాన్ని చూస్తున్నారు. కాబట్టి దోపిడీకి గురయ్యే అన్ని వర్గాల మధ్య ఈనాడు ఐక్యతకు ఖచ్చితమైన అవకాశమున్నది. ఐక్యతకు ఆధారం, పెట్టుబడి యొక్క ఏదో ఒక రూపాన్ని అందిపుచ్చుకోవడం మాత్రమే ఇక ఎంతమాత్రం సరికాదు, పెట్టుబడిని, దాని గమనాన్ని శాశ్వతంగా నిర్మూలించడం మాత్రమే స్వాతంత్ర్యం. "స్థానిక వ్యాపారం" అనేది పై లక్ష్య దిశగా సాగే ధృఢమైన కార్యక్రమంలో ఒక ముఖ్య భాగం.

**2) ఉత్పత్తి వ్యవస్థ, అనుబంధ వ్యవస్థగా మార్పు - ఆర్థిక పెట్టుబడిదారుని విష కౌగిలి!**

ఉత్పత్తి వ్యవస్థలో వస్తున్న అనూహ్య మార్పులు, గత నూటయాభై ఏళ్ళుగా మనం అభివృద్ధి చేసుకొన్న రాజకీయ, ఆర్థిక అవగాహనను తీవ్రవత్తిడికి గురయ్యే స్థితిలో ఉంచుతున్నాయి. భారీ పరిశ్రమలు ఇక ఎంతమాత్రం ఆదర్శప్రాయం కావు. చిన్న చిన్న సముదాయాల నిర్వహణ ఆదర్శంగా మారుతోంది. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ తక్షణ అవసరాలకు, పెట్టుబడి గతి సూత్రాలకు అనుగుణంగా జరిగినది. భారతదేశంలోని నూలు పరిశ్రమనే ఉదాహరణంగా తీసుకొంటే, 1980లో ముంబాయిలో జరిగిన సమ్మె కారణంగా మూతబడ్డ నూలుమిల్లులు మళ్ళీ ఎన్నటికీ తెరుచుకోలేదు. గృహ ఆధారిత మరమగ్గాల వైపుగా నూలు ఉత్పత్తి మళ్ళింది. నూలు మిల్లులను నడిపించడం కంటే కూడా, ఉత్పత్తికి సంబంధించిన అనేక విభాగాలైన - వడకడం, రంగులద్దడం, ముద్రించడం వంటి పనులను ప్రత్యేకంగా ఉండే వృత్తి పనివారిచేత చేయించి, తరువాత కేవలం వారి వ్యాపార చిహ్నాన్ని ముద్రించడమనేది, పెట్టుబడిదారులకు మరింత లాభదాయక మయింది. ఆ విధంగా క్రమ వేతనం, బోనస్, నివాస సౌకర్యం, ఆరోగ్యం, పిల్లల చదువులు, భీమా, సురక్షిత పని సూత్రాలు వంటి అనేక మిల్లు యజమాని బాధ్యతల నుండి విముక్తి పొందాడు. అదే సమయంలో అతని లాభాలు పెరిగిపోయాయి. ఒక్క వేతన విషయాన్నే చూసుకొంటే, మిల్లులోని నేతపనివాడికి నెలకు 5000 రూపాయలు చెల్లిస్తుంటే, అతనిప్పుడు మరమగ్గాల మీద నెలకు 2000 నుండి 2500 రూపాయలు మించకుండా సంపాదిస్తున్నట్టుగా మనకు కనబడుతుంది. ఇంకో రకంగా, పాత మిల్లుపనివాడి సంపాదన సగానికి పడిపోయింది. వస్త్రపు వ్యాపారపు విలువ దిగి రాలేదు. అయితే ఈ డబ్బు ఎక్కడికి వెళ్ళింది? స్పష్టమైన జవాబు ఏమిటంటే - పెట్టుబడిదారుని జేబులోకి.

ఈ మార్పు చేనేత పరిశ్రమలో చాలా స్పష్టంగా కనిపిస్తుంది. కానీ, మిగిలిన పారిశ్రామిక కార్యకలాపాలలో ఇది అంత స్పష్టంగా ఉండదు. యాంత్రిక పరిశ్రమలలో విడివిభాగాల ఉత్పత్తి చాలా పెద్ద ఎత్తున చిన్న చిన్న సముదాయాలలో జరుగుతోంది. భారీ పరిశ్రమలన్నీ అనుబంధ పరిశ్రమలను వీలైనంత చిన్న విభాగాలలో నిర్వహిస్తున్నాయి. ఎవరి ఇళ్ళలోనైతే ఈ చిన్న, బుల్లి సముదాయాలను నిర్వహిస్తున్నారో, వారే ఆ యంత్రపరికరాలకు, ఉపకరణాలకు యజమానులు. ఆవిధంగా, భౌతిక పెట్టుబడి యొక్క యాజమాన్యం మీద పెట్టుబడిదారుడి శక్తి ఆధారపడి లేదు, ఎందుకంటే పెట్టుబడిదారుడు వాటికి అసలు యజమాని కాడు. పెట్టుబడిదారుని శక్తి ఆర్థిక పెట్టుబడి నియంత్రణ నుండి ప్రవహిస్తోంది. ఇది అతన్ని ఈ సముదాయాలన్నిటినీ సంపూర్ణమైన పొందికలోకి తీసుకు వచ్చేందుకు అనుమతిస్తోంది, అదే దాని ప్రత్యేకత.

ఆవిరి యంత్రాల శకంలో భారీ పరిశ్రమలు ఆదర్శప్రాయమైనవి. ఆ రూపంలో నున్న శక్తికి, సాంకేతికతకు భారీ పరిశ్రమ అత్యంత లాభదాయకమైన రూపం. స్వాతంత్ర్యానంతరం భారతదేశం వంటి దేశాలకు భారీపరిశ్రమ ఎంత ఆదర్శప్రాయమైనదిగా బహూకరింపబడిందంటే, అంతగా అది ఆర్థిక అభివృద్ధికి నేటికీ పర్యాయపదంగా మారింది. చాలా ఎక్కువకాలంపాటు భారీపరిశ్రమ ఆదర్శప్రాయంగా నిలిచింది. పనికి గౌరవం, నిర్వహణా నియమాలు, ప్రావీణ్యత, ఆర్థిక కొలమానాలు వంటి అనేక సూత్రాలు ఈ నమూనాలో ప్రతిపాదించబడ్డాయి. ఇప్పుడు ఈ ఉత్పత్తి ప్రపంచమంతా కూలిపోతోంది. ఐరోపాలో జరిగిన పారిశ్రామిక విప్లవమప్పటి నుండి ఉన్న నిర్మాణాలన్నీ, వాటిని బలపరచే, వ్యతిరేకించే సాంఘిక, ఆర్థిక సిద్ధాంతాలన్నీ ఒక్కసారిగా కుప్పకూలబోతున్నాయి. ఆ విధంగా పెట్టుబడి గమనం ద్వారా పుట్టిన అవసరాలు, "పెట్టుబడి దానంతటదే ధ్వంసమయ్యే అవకాశముంది" (అన్ని రకాల పెట్టుబడులు సంపూర్ణంగా) అనేటటువంటి చారిత్రాత్మక అవకాశానికి కూడా జన్మనిస్తున్నాయి. ఇప్పుడు దోపిడీ యొక్క మూలం ఉత్పత్తి సాధనాల యాజమాన్యంలో లేనప్పుడు మార్క్స అనుచరులంతా పెట్టుబడి, మానవసంబంధాల ప్రాథమిక వివరణ ఇచ్చే మార్క్స సిద్ధాంతంలోని ఖాళీల వైపుగా చూడటం విధాయకం. పెట్టుబడి, మానవ సంబంధాలు మరియు వర్గరహిత సమాజ మనే స్వప్నంగా రెండు కాళ్ళ యొక్క ప్రాథమిక అవగాహన మీద, రాబోవు దశాబ్దాలలో పోరాటం యొక్క మూలాన్ని వారు కనుగొనాలి. వాళ్ళు కూడా "స్థానిక వ్యాపారం" వైపు మార్పు తీసుకోవలసిన అవసరం నేడు ఉంది.

చిన్న సముదాయాలలోని ఉత్పత్తి నిర్వహణల వైపుగా మళ్ళే విధంగా; వాణిజ్య రీతులు, నిర్వహణా రీతులు తగిన రూపాన్ని పొందటం దీన్నే సూచిస్తోంది. దూరవాణి, చరవాణి, ఈ-లేఖలు, అంతర్జాలం, గణయంత్రాలు, దూరదర్శిని వంటి నూతన దూరప్రసారాల సాంకేతికత కొత్త నియంత్రణా సాధనాలను అందిస్తున్నాయి. ఇటువంటి స్థితిలో గృహ, చిన్న తరహాకుటీర పరిశ్రమలను ప్రోత్సహించడం ఈ సామ్రాజ్యవాద కొత్త రూపానికి ఎటువంటి వ్యతిరేకతను ఏర్పరచడం లేదు. ఇందులో మొదటి అంశంగా, చిన్న పరిశ్రమలలో ఏమి ఉత్పత్తి చేయాలి, భారీపరిశ్రమలలో ఏమి ఉత్పత్తి చేయాలన్నది అంతర్జాతీయ ఆర్థిక శక్తి దాని అవసరాలకు తగ్గట్టుగా నిర్దేశిస్తోంది. ఈ చిత్రీకరణను ఈ ఆకృతిలోనే ముందుకు తీసుకువెళ్ళడంలో రాజకీయ శక్తుల బలాల, సాంకేతికతా స్వభావాల రీత్యా పరిమితులూ, వత్తిడులూ ఉండవచ్చు. కానీ మార్పు దిశకు సంబంధించి ఎటువంటి పొరపాటు ఉండబోదు. ఈ మార్పు చిన్న పెట్టుబడులవైపుగా ఎటువంటి గమనాన్ని కానీ, రాజకీయంగా, ఆర్థికంగా ఎటువంటి వికేంద్రీకరణను కానీ సూచించదు.

పెట్టుబడిదారుడు అన్ని నియంత్రణలను తన గుప్పెట్లోనే ఉంచుకోవడం కొనసాగుతూ, పెట్టుబడి కేంద్రీకరణ పెరుగుతూ, దానికి అనుగుణంగా రాజ్యం యొక్క బలం పెరుగుతోంది. ఈ మొత్తం ప్రక్రియలో భారీ పెట్టుబడి రాజకీయాలకు ప్రాతినిధ్యం వహించే ఒక వర్గం, గృహ ఆధారిత పరిశ్రమలను, స్వదేశీని, వృత్తిపనివారినీ ప్రోత్సహించడం గురించి పెద్ద గొంతుకతో మాట్లాడుతోంది. గాంధీజీ వ్యూహంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమలు కేంద్ర స్థానాన్ని ఆక్రమిస్తాయి కాబట్టి ఈ విధంగా గాంధీజీకి కొనసాగింపుగా వ్యవస్థీకరింపబడటానికి అది ప్రయత్నిస్తోంది. గాంధీజీ ఆనాడు ఖాదీ, గ్రామీణ పరిశ్రమలనేవి సామ్రాజ్యవాదాన్ని సవాలు చేయడానికి ఒక రాజకీయ ఆధారాన్ని ఏర్పాటు చేశాయన్న విషయాన్ని అర్థంచేసుకోవడం అవసరం. అయినప్పటికీ ప్రపంచ ఆర్థిక క్రమం ప్రాథమిక మార్పులకు లోనవుతోంది. కాబట్టి స్థానిక వ్యాపారాన్ని స్వదేశీ, గృహ ఆధారిత పరిశ్రమలకు ముడివేస్తే తప్పితే నయా పెట్టుబడిదారుడు స్వదేశీ, గృహ ఆధారిత పరిశ్రమల రాజకీయాల నుండి బలం పొందుతూనే ఉంటాడు. ఇప్పుడు ఈ విధంగా గాంధీజీ పరంపరను, ఆలోచనల కొనసాగింపును తప్పుడు ప్రచారం ద్వారా స్వంతం చేసుకోదలచినప్పుడు ఈ నూతనమార్పులను అర్థంచేసుకోవడం, వారి లక్ష్యాలను అందుకొనే విధంగా అవసరమైన మార్పులను తమలో తీసుకురావడం అత్యవసరం, ఇంకా దీనికోసం వారి ఆర్థిక సిద్ధాంతాలలో గ్రామీణ పరిశ్రమలకు, గృహ

ఆధారిత పరిశ్రమలకు ఎటువంటి గౌరవమైనస్థానాన్ని ఇచ్చారో "స్థానిక వ్యాపారానికి" అటువంటి గౌరవాన్నే ఇవ్వాలి.

ఉత్పత్తిని చిన్న విభాగాలలో నిర్వహించడానికి అనుకూలమైన ఈ మార్పు పెట్టుబడిదారుల ప్రయోజనాలను తీరుస్తూ, అదే సమయంలో గాంధీజీ దృష్టిలోని సామాజిక మార్పుకు సంబంధించిన ముఖ్యమైన నియమాన్ని కూడా పూరిస్తుంది. సమాజంలో ఎవరైతే మార్పును తీసుకురాగలరో అటువంటివారి వస్తు స్థితిగతుల్లో మార్పును తీసుకువచ్చే గొప్ప కార్యాన్ని నిర్వర్తించడానికి అది సహాయపడుతుంది. భారీ పరిశ్రమలను మూసివేసి, చిన్న విభాగాలలో ఉత్పత్తి నిర్వహణను ప్రోత్సహించడమే రాజ్య తంత్రంగా మారుతోంది. ఈ రెండిటిలో కూడా "స్థానిక వ్యాపారం" ముఖ్యస్థానాన్ని ఆక్రమించడాన్ని చూడడంలో కష్టమేమీ వుండదు.

**3) వాణిజ్యం - వ్యాపారం** : "వాణిజ్యం" అనేది ప్రపంచీకరణ పేరుతో జరుగుతున్న మార్పుల గూర్చిన చర్చలలో ఎక్కువగా మాట్లాడుతున్న విషయం. అంచనా కట్టలేనంతగా ఉన్న అమెరికా, ఐరోపా సంపదలకు కారణాలుగా మూడు మూలాలను గుర్తించారు. ఒకటి పనివాడి శ్రమ వినియోగం; రెండు శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతి; మూడు వాణిజ్యంలోని అసమతుల్య వినిమయం. పనివాడి శ్రమవినియోగం అమెరికా, ఐరోపాలలో కాకుండా తృతీయప్రపంచ దేశాలలో జరుగుతున్నప్పుడు, ఈ వినిమయ విలువ అసమతుల్యమైన మార్పిడి ద్వారా అమెరికా, ఐరోపాలకు చేరుతోంది. నవీన సాంకేతిక విలువను పుట్టించడానికి కొత్త మార్గాలు తెరుస్తోంది. కానీ, ఆ విధంగా సృష్టించబడిన విలువ, అమెరికా, ఐరోపాలకు - మళ్ళీ వాణిజ్యంలోని అసమతుల్యమైన మార్పిడి ద్వారానే చేరుతోంది. ఈ విధంగా వాణిజ్యం లేక వర్తక విస్తరణ మాత్రమే అపూర్వ సంపద కేంద్రీకరణకు పునాదిని వేస్తోంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా, ఐరోపాలలో పోగుబడ్డ అసాధారణ సంపదకు ఆధారాన్ని తృతీయ ప్రపంచదేశాలలోని వర్తక విస్తరణలో చూడవచ్చు. వ్యాపారాలను నూతన స్థాయిలో గుణాత్మకంగా విస్తరింప చేయడానికే ఇప్పుడు ప్రపంచీకరణ పేరుతో మళ్ళీ ప్రయత్నాలు.

ఏదైనా వస్తువు ఉత్పత్తి అయిన చోటు నుండి దూరంగా అమ్మబడుతున్నప్పుడు, ఆ మార్పిడి ద్వారా ఇరుపక్షాలు పొందే రాబడి, సమాజంలోని వారి బలాలకు సూచికగా ఉంటుంది. కాబట్టి దూరప్రాంతాలలో జరిగే మార్పిడి (ఉత్పత్తిదారుని నియంత్రణకు బయట జరిగే మార్పిడులు కూడా) ఎప్పుడూ కూడా బలమైన వర్గాల వారికి మాత్రమే అనుకూలంగా ఉంటుంది. వర్తకమంటే ఇదే. మిగిలినదంతా కొట్లు పెట్టుకోవటం తప్పితే వేరేమీలేదు. ఈ రోజు అంగళ్ళన్నిటినీ వర్తకంలో కలుపుకొనే ప్రయత్నం జరుగుతోంది. అందువల్లనే వస్తు పరంగా వాణిజ్య విస్తరణ జరగకపోవడాన్ని చూస్తూవుంటాము (అంటే, వస్తుమార్పిడి యొక్క మొత్తం పరిమాణంలో పెద్ద తేడా ఉండదు), కానీ వర్తక విస్తరణ మాత్రం నిర్దయగా అన్ని వేళలా జరుగుతోనే ఉంటుంది. ఒక చిన్న ఉదాహరణ ఏమిటంటే, నిర్వహణా నిపుణులు, వాణిజ్య పరిశోధనా సంస్థలు చిల్లర వర్తకంలోని లాభసాటి అవకాశాలు, బహుళజాతి సంస్థల ముందు, వాణిజ్య భవనాల ముందు తైతక్కలాడుతున్నాయి. ఈ విధానంలో వర్తక ప్రపంచపు ఆవల జరిగే ఉత్పత్తి చర్యలన్నీ, అందులోనే విలీనమౌతున్నాయి. చేతి వృత్తుల సంతలన్నీ ఈ రోజు ఇదే పని చేస్తున్నాయి. కుటుంబ శ్రమ చేత, నైపుణ్యం చేత, అందుబాటులోనున్న అతితక్కువ పెట్టుబడితో ఉత్పత్తయి, మనచుట్టుపక్కన ఉండే దుకాణాల్లో దొరికే వస్తువులన్నీ వర్తక వ్యవస్థలో విలీనమౌతున్నాయి. వర్తకంలో కలిసిపోలేనిది ఏదీ కూడా ఉత్పత్తి అవ్వదు. మంచి నీళ్ళతో సహా ఆ విధంగా వర్తకవిస్తరణ, యాజమాన్య నిర్మాణంతో కానీ, ఉత్పత్తి విధానంతోకానీ సంబంధం లేకుండా చివరికి వర్తకం క్రిందకు ఇముడ్చుకోలేనన్నిటినీ కూడా వర్తకంలో కలుపుకునే లక్ష్యంతో ఉంటుంది. ఇంకొకమాటలో చెప్పాలంటే, ప్రజలు ఉపేక్షించి ఉండాలి లేదా నిష్క్రియాపరంగానన్నా ఉండాలి.

వర్తకం మనిషికి అతి పెద్ద శత్రువు. ఆర్థిక పెట్టుబడికి ఇది వ్యక్తీకృత రూపం. రైతుల, వృత్తిపనివారు, స్త్రీలు, వంటి స్థానిక సమాజానికి వారి బ్రతుకులపై వారికే నియంత్రణ లేకపోవడానికి మూలకారణం వర్తకంలోనే దాగి ఉంది. గిరిజనులు, స్వదేశీయత, మానవ సృజనా దెబ్బతినడానికి, మానవ జీవితాలలో (ఉత్పత్తిదారుని నుండి వినియోగదారుని దాకా) మానవీయ విలువలు నశించడానికి వర్తకానిదే బాధ్యత. వర్తకం మనిషిని ప్రజావిజయాలనుండీ, సంబరాలనుండీ దూరం చేసి ప్రత్యక్ష, అంధ, అతీంద్ర శక్తుల కబంధహస్తాల మధ్య వదిలివేస్తోంది. వలసవాదం, సామ్రాజ్యవాదం, శ్రమదోపిడీ, జ్ఞానదోపిడి (ప్రజల విజ్ఞానం, నైపుణ్యం, మంచి చెడు విచక్షణా విలువలు వంటివి), సామాన్య మానవుల హక్కుల ఆక్రమణలకు అంతిమమూలం వర్తకంలోనే ఉంది. మనిషికి మనిషితో ఉండే సంబంధాన్ని వర్తకం మార్చివేసింది. వర్తకంచే సృజించబడిన ఈ కొత్త ప్రపంచంలోనే ఉంది. మనిషికి మనిషితో ఉండే మానవ సంబంధాన్ని వర్తకం మార్చివేసింది. వర్తకంచే సృజించబడిన ఈ ప్రపంచంలో మనిషి తన భావాలకు, అనుభవాలకు తనే పరాయివాడుగా మారుతున్నాడు. ఇంకొక మాటలో జ్ఞానానికి, గ్రహణశీలతకు మధ్య ఉన్న సంబంధం ఛిద్రమవుతోంది. అందువలన మనిషికి తన స్వంత ప్రయోజనాలేమిటో, తనకు కావలసినవేమిటో తెలియట్లేదు. ఎందుకంటే లోపలికి తొంగి చూసినప్పుడు, తను వర్తకంద్వారానే సంబంధంపెట్టుకో గలిగిన వేరొక వ్యక్తి కనబడతాడు. ఆ విధంగా అతను తన గురించి ఆలోచిస్తున్నప్పుడు, నిజానికి అతను అక్కడ లోపల కూర్చున్న వ్యక్తి గురించి ఆలోచిస్తో, వర్తక ప్రయోజనాల దృష్టితో ఆలోచిస్తాడు. వాణిజ్య కేంద్ర దృష్టివలన తన స్వంత దృష్టిని (అనుభవాలను) కోల్పోతాడు. ఇది కోడి ముందా గుడ్డు ముందా లాంటి అదే పాతకథ! వర్తకం వలన మనిషి పరాధీనుడవుతున్నాడా లేక మనిషి తన ఆత్మను కోల్పోవడంద్వారా వర్తకం పుడుతుందా? నేటి ఆర్థిక వ్యవస్థయొక్క మహాభవనమంతా వర్తక పునాది మీదేనిర్మితమయ్యింది. ఇది మనిషి స్వభావాన్ని మార్చి, వక్రీకరించి, విపరీత స్వభావానికి గురిచేస్తోంది. అదేవిధంగా పెట్టుబడి, వాణిజ్యం, లాభం, వడ్డీ, సంపద, రాజ్యం నిర్మితమయ్యాయి. మనిషికి అనుకూలంగా సమాజాన్ని పునర్నిర్మించడానికి వర్తకపరాధీనత ఒక అత్యవసర విషయం. స్థానిక వ్యాపారం ఆలోచన వర్తకానికి వ్యతిరేకంగా జరిగే నిర్ణయాత్మకమైన పోరాటానికి పునాదిగా ఉంటుంది.

**4) సాంకేతికత** : దూరప్రసారాలు, జీవసాంకేతిక విజ్ఞానంలో జరుగుతున్న అభివృద్ధిని సాంకేతిక విప్లవంగా అభివర్ణిస్తారు. ఆధునిక పరిశ్రమల ద్వారా జరిగే పర్యావరణ విధ్వంసం నేపథ్యంలో ఈ సాంకేతికతలు ఒక ప్రత్యేకమైన శ్రద్ధను రేకెత్తించాయి. దూరప్రసారాలనేది ఉత్పత్తికి సంబంధించిన సాంకేతికత కాదు. కానీ దాని సర్వవ్యాప్త విస్తరణ వలన, సమాచార, సాధారణ వ్యవస్థల వ్యవస్థీకరణ, విస్తరణల మూలంగా, సేకరణలోని నేర్పువలన అది మ న దృష్టిపథాన్ని తప్పించుకొంటోంది. జీవసాంకేతికత అనేది కొత్త జీవన పద్ధతులు, పదార్థాలు, కొత్త ఉత్పత్తి విధానాలను తీసుకువచ్చిన సాంకేతికత. జీవసాంకేతిక విజ్ఞానం రసాయన ఎరువుల వలన భూమికి, పర్యావరణానికి జరిగే విధ్వంసాన్ని నివారిస్తుంది. జీవావరణశాస్త్రం మీద జీవసాంకేతిక ప్రభావం, మానవ ఉనికి, ప్రయోజనాలపై జీవసాంకేతికత యొక్క ప్రతికూల ప్రభావాలపైన చర్చ ఇంకా ప్రారంభ దశలో ఉంది. చాలా నైతిక విషయాలు ఈ సందర్భంగా ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. ఆర్థిక దృష్టిలో చూసినట్టయితే, గమనించవలసిన ముఖ్యవిషయం ఏమిటంటే, ఈ రెండు సాంకేతికతలు (జీవసాంకేతికత, దూరప్రసారాలు) కూడా సాధారణ మానవుని హితానికి ఉపయోగపడుతాయనడానికి సూచించేదేమి లేదు. ఈ రెండు సాంకేతికతలు కూడా అధిక వ్యయాన్ని, పెట్టుబడులను బలపరిచేవే. ఎక్కువలో ఎక్కువగా ఇవి పాలకవర్గాల సమతుల్యాన్ని మార్చవచ్చు. ఈ సాంకేతికతలు ఆర్థిక కేంద్రీకరణను వేగిరపరచి, విభిన్న సామాజికవర్గాల మధ్య, భౌగోళిక విభాగాలమధ్య ఉత్పత్తిని వ్యాపింప చేసే మార్గాన్ని సుగమం చేస్తో, ఆర్థిక, నిర్వహణా నియంత్రణలను మాత్రం ఉంచుకొంటోంది.

తదనంతరం సాంకేతిక క్షేత్రంలో ఆలోచనా స్థాయిలో ఒక ముఖ్యమైన మార్పు జరిగింది. ఒక ఇరవై ఏళ్ళముందు వరకు సాంప్రదాయ శాస్త్ర, సాంకేతికతల గురించి వినడానికి ఒక్కరు కూడా ఉండేవారు కాదు. కానీ ఉత్పత్తిలోని వివిధ రకాల పద్ధతుల, విధానాల సాంప్రదాయ విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి అతిపెద్ద పరుగుపందెం జరుగుతున్నట్టుగా కనిపిస్తోంది. ఇదంతా ఎందుకు జరుగుతోందంటే సాంప్రదాయ శాస్త్ర, సాంకేతికలు ఉత్పత్తిలో ప్రతిభావంతమైన పద్ధతులు తెస్తే, వర్తకం గొప్పగా విస్తరణా చెందడానికి అవకాశం ఇస్తాయి. అవి వ్యవసాయం, పరిశ్రమలు, ఆరోగ్యం, కట్టడాలు, నిర్మాణాలు, లోహపరిశ్రమలు, అద్దకం వంటి ఏ క్షేత్రంలోనైనా కావచ్చు. సాంప్రదాయ శాస్త్ర, సాంకేతికతల ఆకర్షణ ఇదే. అయినప్పటికీ, ఈ విధానంలో నూతన నేపథ్యంలో పశ్చిమదేశాలు కానటువంటి దేశాల విజ్ఞానం ఆవశ్యంగా మారుతుంది. విజ్ఞాన స్వభావాన్ని ప్రజాచర్చలో తీసుకువచ్చే అవకాశాల నియమావళిని ఇది సృజిస్తుంది. ఆధునిక విజ్ఞానమే అసలు సిసలైన జ్ఞానానికి ఏకైక హక్కుదారుగా ఉండటాన్ని సవాలు చేసే అవకాశాలకు ఇది ద్వారాలు తెరుస్తుంది. ప్రపంచ సామ్రాజ్యవాదం ఖచ్చితంగా ఈ విషయంలో సంతోషంగా ఉండలేదు.

మరోప్రక్క, మనం తృణీకరించిన ఈ సాంప్రదాయ సాంకేతికతలు, ప్రకృతి విధానాలు, వాటికి కావలసిన ప్రజ్ఞా పాటవాలు, నేర్పు ఆ సమాజాల దగ్గర ఉన్నాయి అన్నది నిజం. ఒక వేళ వారి ప్రజ్ఞా పాటవాలని తిరస్కార, పరాభవ అగాధాలనుండి వెలికితీసి, నయా అభ్యుదయ ఆర్థిక వ్యవస్థలో పొందుపరచినట్లయితే, వీరి విజ్ఞాన, సామర్థ్యాలు సిద్ధాంత స్థాయిని పొందకుండా ఆపే అవకాశంలేదు. ఆ దిశలో జరిగే ఆందోళనే లోకవిద్యను అందలమెక్కించే ఆందోళన ఉద్యమం. అదే "లోకవిద్య జనాందోళన"

స్థానికవ్యాపారమనేది లోకవిద్యకు సహజ మిత్రుడిగాను, ఆధునిక శాస్త్రమే విజ్ఞానానికి ఏకైక హక్కుదారుగా ఉండే గుత్తాధిపత్యాన్ని సవాలుచేసే క్షేత్రంగానూ ఉంటుంది. సాంప్రదాయ సాంకేతికతలకు కొత్తమార్గాలను తెరవడమనేది ఆ సమాజాలలో లోకవిద్య (ఇంకా అందులోని భాగమైన, ప్రపంచ వాణిజ్య, వర్తకం వాడుకునే, సంప్రదాయ సాంకేతికత) అంతర్గతంగా వుండే కొత్త దైన సేవలను తీసుకువస్తుంది. అదే సమయంలో ఈ కొత్త సేవల సృష్టికి అవసరమైన పద్ధతులు ఈ సమాజాలు, జాతులు, వర్గాలనీ ప్రపంచ సామ్రాజ్య వాదానికి ఒక బలీయమైన సవాలును విసరగలిగేట్టుగా ఆ అడ్డంకులని అధిగమించాలి. ఈ సవాలుకు ఒక రూపానివ్వడానికి లోకవిద్యతో పాటుగా స్థానికవ్యాపారం ఒక మంచి వేదిక మరియు భావన.

**5) వనరులు** : సాంకేతిక పురోగతి వనరుల అవకాశాన్ని పెంచుతుంది. ఎలాగైతే ఆవిరియంత్రం బొగ్గును ఒక ముఖ్య వనరుగా మార్చిందో, అదేవిధంగా కొత్త విధానాలు, సాంకేతికతలు మరిన్ని ప్రాకృతిక వనరులను విస్తరిస్తూ పోతున్న ముడిసరుకుల జాబితాకు జతకూర్చేందుకు అవకాశమిస్తున్నాయి. జీవసాంకేతిక విజ్ఞానం, సంప్రదాయ శాస్త్ర సాంకేతికత రెండూ కూడా పదార్థ వనరుల జాబితాను భారీగా విస్తరింపచేస్తాయి. జీవ వైవిధ్యం, మొక్కలు, వృక్షాలు, పొదలు, వేర్లు, మొలకలు, మూలికలు, అన్ని రకాల వృక్ష జంతుజాలాలు ముడిసరుకుగా మారాయి. ఆధునిక సాంకేతికత అభివృద్ధి చెందకముందు నిరుపయోగంగా లేక స్వల్ప ఉపయోగకరంగా ఉన్న బొగ్గు, బాక్సైట్, లాంటి వనరులకంటే ఇవి భిన్నమైనవి.

సామ్రాజ్యవాదంలో కనిపించే ఒక ముఖ్య గుణాత్మక లక్షణం - అది వర్తకాన్ని ముడిసరుకులో జొప్పిస్తుంది. ఐరోపాలోని పారిశ్రామిక విప్లవానికి ముందు వర్తకం వినియోగవస్తువులలోనే ఉండేది. అవి నిత్యావసరాలు కావచ్చు. ఆభరణలు, మెరుపువిలాస వస్తువులు కావచ్చు. అరుదుగా వాడే వస్తువులు కావచ్చు. కానీ ఆధునిక సాంకేతికత మొదటనుండి ముడిసరుకుల వర్తకంపైనే ఆధారపడింది. అందువలననే ఇప్పుడు జీవవైవిధ్యం కూడా వర్తకపు లక్ష్యంగా మారుతోంది. ఇవన్నీ కూడా ఆ ప్రజలచే విరివిగా వాడబడే స్థానిక వనరులు. గ్రామీణులు, గిరిజనులు వారి దైనందిక జీవితంలో జీవవనరులను చాలా విరివిగా వాడుతారు. జీవవనరులు పెద్ద ఎత్తున వాడబడే, ఆహారం, ఆరోగ్యం, మేత, వంటచెరుకు, వ్యవసాయం, వృత్తినిపుణులచే తయారుకాబడ్డ వస్తువులు ఈ కోవలోకి వస్తాయి. ఇప్పుడు, జీవసాంకేతికత మరియు ఆర్థిక పెట్టుబడుల దర్శకత్వ నియంత్రణలలో, సంప్రదాయ సాంకేతికత, ఈ ప్రాకృతివనరులన్నిటినీ ముడిసరుకుగా మారుస్తోంది. అందువలన ఈ వనరులతో భారీ యెత్తున వర్తకం జరుగుతోంది. దీని పర్యవసానంగా స్థానిక ప్రజలు తమ చుట్టూ ఉన్న ప్రకృతి నుండి వెళ్ళగొట్టబడుతున్నారు.

జీవ సంపదలో ప్రజాహక్కుల సంరక్షణ కోసం ఆందోళనలు ముందునుంచీ ఉన్నాయి. అడవులపై గిరిజనుల హక్కులాంటిదే ఇది. ఈ సందర్భంగా మనం పట్టించుకోవలసిన రెండు ముఖ్య ప్రశ్నలు : (1) చట్టం, సాంఘిక హక్కుల నేపథ్యంలో ఈ పోరాటాలను చేయవచ్చా? (2) ఒక ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థ భావన నుండి సహాయం పొందడం అవసరమా ఇంకా అటువంటి వ్యవస్థను సృష్టించడం ఎలా? ఒకవేళ అటువంటి చట్టపరమైన సాంఘిక పోరాటం సాధ్యమైనా దాని ఒకే ఒక పర్యవసానం, స్థానిక జీవవనరులలో వర్తక రీతి రూపాలు మారుతాయి. కానీ అటువంటి వర్తకం మట్టుక్కు ఆగదు. జీవవనరులలో వర్తకానికి వ్యతిరేకంగా తుదివరకు ఒక నిర్ణాయత్మక పోరాటాన్ని చేసి, గెలిపించే నూతన ఆర్థిక వ్యవస్థకు నాంది "స్థానిక వ్యాపారం" కావచ్చు.

**6) ఉత్పత్తి వర్గాలు** : పెట్టుబడి, ఉత్పత్తి నిర్వహణ, వాణిజ్యం, సాంకేతికత, వనరులలో వస్తున్న మార్పులు ఉత్పత్తి చేసే ప్రజల యదార్థస్థితులను, వారి ఆర్థిక, సాంఘిక నిర్వహణలను అందుకోలేని మార్పులకు గురిచేస్తాయని ఊహించారు. కేవలం కూలీలు మాత్రమే ఉత్పత్తి చేస్తారన్న భావనే శుద్ధమైన పెట్టుబడిదారి వ్యవస్థకు మూల సూత్రం. దీనిని పోలీనటువంటిదే పశ్చిమ పెట్టుబడిదారి వ్యవస్థలో ఒకానొక సమయంలో శ్రామిక వర్గ రూపంలో ఉనికిలోకి వచ్చింది కానీ, మూడవ ప్రపంచ దేశాలలో ఇటువంటిదేమీ జరగలేదు. భారతదేశం వంటి దేశాలలో రైతులు రైతులుగానే ఎక్కువభాగం మిగిలిపోయారు. స్వాతంత్ర్యానంతరం పెట్టుబడిదారుని అభివృద్ధిలో మొదటిమెట్టుగా రాచరిక, జమిందారీ వ్యవస్థ ఇంకా అటువంటి ఇతర మధ్యంతర వ్యవస్థలు నిర్మూలనమైనాయి. ఆ విధంగా రైతు పెట్టుబడితో నేరుగా సంబంధం కలిగి ఉండే స్థితికి తీసుకురాబడ్డాడు. చిన్న చిన్న కమతాల, భూముల యజమానులంతా ఒక నూతనవర్గంగా ఏర్పడేందుకు ఒకచోటికి వచ్చి చేరారు. గత ఇరవై-పాతికేళ్ళగా వీరి ఆందోళనే రైతుల ఆందోళనగా పిలవబడుతోంది.

ఇది భారీ పరిశ్రమలు అభివృద్ధి చెందే కాలం. ఈ మొత్తం విధానంలో, సంప్రదాయ విజ్ఞానానికీ, నైపుణ్యానికీ మూలమైన, కుటుంబ విభాగాలలోని ఉత్పత్తిని నిర్వహించే, వృత్తి నిపుణులు క్రమంగా శిథిలమౌతున్నారు. కానీ భారత దేశంలో ఏవిధంగానైతే ఆంగ్లేయుల దోపిడీ ద్వార క్షీణించి, శుష్కించి పోయినప్పటికీ పూర్తిగా అంతరింపబడలేదో, అదేవిధంగా వలసవాదులకాలంలోనూ, తదనంతర భారీపరిశ్రమలు అభివృద్ధి చెందినకాలంలోనూ వృత్తిపనివారి సమూహాలు శుష్కించి, శిథిలమయ్యి, ఆకలితో అలమటించినప్పటికీ పూర్తిగా అంతరించలేదు. దోపిడీకానీ, పెట్టుబడి కానీ ఈ దేశపు గొప్ప సంస్కృతిని నిలబెట్టి వాటికి జీవనాధారంగా ఎవరైతే ఉన్నారో ఆ వృత్తిపనివారి నైపుణ్యాన్ని, విలువలనీ లోతులవరకు కొలవలేక పోయాయి. వృత్తిపనివారి వర్గం పునర్నిర్మాణానికి ఒక పునాదిని అందించడంకోసం ఆ విజ్ఞానం, నైపుణ్యం విచ్చిన్నదశలో కూడా బతికి బట్టకట్టాయి. ఉత్పత్తి నిర్వహణలోనూ, ఇతర ఆర్థిక విధానాలలోను ఇప్పుడు వస్తున్న మార్పులు వృత్తిపనివారి సమాజాన్ని ఒక సాంఘికవర్గంగా మారుస్తున్నాయి.

ఇప్పుడు, ఎలా ఉత్పత్తయినా, ఎక్కడ ఉత్పత్తయినా ప్రతి వస్తువులోకి వర్తకం వచ్చిచేరినందువలన, వాణిజ్యం ప్రతి పట్టణాన్ని, పల్లెను, కుగ్రామాన్ని, ఆవాసాలను అవి దగ్గరవైనా దూరంవైనా సరే చేరుకొంది. కాబట్టి ఉత్పత్తి విధానంతోనూ, ప్రదేశంతోనూ సంబంధంలేకుండా వృత్తిపనివారందరూ ఒకే ఆర్థిక స్థితిని కలిగి ఉన్నారు. ఆర్థిక పెట్టుబడి ఒక సాంకేతిక రూపానికి, ఇంకొకదానికి మౌలిక వ్యత్యాసాన్ని చూపించదు కాబట్టి, సంప్రదాయ వృత్తి నిర్వహించే వృత్తిపనివారికీ, ఆధునిక సాంకేతికతనుపయోగించే నిపుణులైన వృత్తిపనివారికీ ప్రాథమిక వ్యత్యాసం ఉండదు. ఇప్పుడు భౌతిక వనరులతో సమానస్థాయికి జీవవనరులు తీసుకురాబడినప్పుడు, గిరిజనులు, మహిళలు, రైతుల ఉత్పత్తి విధానము, జీవన వైఖరి ఏ వృత్తిపనివారి పనికీ భిన్నంగా ఉండదు. పర్యావసానంగా, పెట్టుబడిదారి వ్యవస్థను సవాలు చేసే శ్రామికవర్గం క్రమంగా వృత్తిదారుల సమాజంగా రూపుదిద్దుకొంటుంది. ఈ వృత్తిదారుల సమాజానికి దానికే స్వంతమైన సంప్రదాయం, చరిత్ర, విద్య, ప్రాంతీయ, స్థానిక జ్ఞానము, దృష్టి ఉన్నాయి. ఇవి దాని స్వధర్మాన్ని నిర్వచిస్తాయి. వృత్తిదారుల సమాజం ప్రపంచీకరణను వ్యతిరేకించడంలో ముందుంది. దాని స్వధర్మం నూతన సమాజ పునర్నిర్మాణానికి పునాదిని వేస్తుంది. రెండిటిలోను స్థానిక వ్యాపారానికి ప్రతిభావంతమైన పాత్ర ఉంది; ఒకటి, ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటంలో ఐక్యతను తీసుకురావడంలో; రెండు, వృత్తిదారుల సమాజ స్వధర్మానికి పటిష్టమైన స్థానిక, నిగూఢ వ్యక్తీకరణను ఇవ్వడంలోనూ.

## II. స్థానిక వ్యాపారమే ఎందుకు?

స్థానిక వ్యాపారం నేటి కాలానికి గొప్ప అవసరం. ఉత్పత్తి వర్గాలు వారి జీవితాలను సంస్కరించుకోవడానికి బహుశా ఇదొక్కటే మార్గం.

ఆధునిక జీవితంలో వ్యాపారమనేది మనజీవితాలలోని ఆర్థిక అంశాలతో ముడిపడిన సామాజిక పరస్పర చర్యలు జరిగే ప్రదేశం. విజ్ఞాన క్షేత్రంలో విద్యాలయం లేక విశ్వవిద్యాలయమనేది ప్రజలు ఒకరితో ఒకరు కానీ, పూర్వికులతోకానీ ముఖాముఖిగావచ్చి, వారి తరువాతి తరాలతో సంబంధం ఏర్పరుచుకొని, వారి ప్రతిచర్యలకు రూపం కలిగించే ప్రదేశం. మతంలో దేవాలయాలు, మసీదులు, చర్చి దేముడితో సంబంధం ఏర్పరుచుకొనే ప్రదేశాలు కావు. మనిషికి దేవుడితో సంబంధం ఏర్పరుచుకోవడానికి ఏ బహిరంగ ప్రదేశం అక్కర్లేదు. అటువంటి బహిరంగ ప్రదేశాలతో కూడిన ఆచారాలు ప్రజలు ఇతర ప్రజలతో సంబంధం నెరపేందుకే. ఆ విధంగా జీవితంలో విభిన్న అంశాలలో ప్రజలమధ్య సంబంధాలు సుగమం చేయడానికి ప్రజా కట్టుబాట్లు ఎల్లప్పుడు ఉన్నాయి. ఈ కట్టుబాట్లు కానీ, చట్టాలు కానీ శాశ్వతమైనవి కావు, కొంతకాలానికి అవి వాటి లక్ష్యాలకు న్యాయం చేయలేకపోయేవి. అప్పుడు వాటిలో మార్పు అనేది తప్పనిసరి. నేటి విద్యాలయాలు, దేవాలయాలు, వ్యాపారాలు విద్యా, మత, వ్యాపార క్షేత్రాలలో న్యాయ ఆధారిత పరస్పర చర్యలకు సాధనాలను ఏర్పరచడంలేదు. గాంధీజీ ప్రాథమిక విద్యా, ప్రార్థనా సమావేశాలు, గ్రామీణ పరిశ్రమలు, గ్రామీణ వ్యాపారాల భావనలతో ముందుకు రావడానికి బహుశా ఇదే కారణం కావచ్చు. ప్రాథమిక విద్యలోని విలువలు, ఆచరణలు ఆధునిక విద్యకంటే ఏవిధంగానైతే పూర్తిగా భిన్నమైనవో, దేవాలయాలకు పరాయివైన నమ్మకాలు, ఆచారాలకు ప్రార్థనా సమావేశాలు ఏవిధంగా మద్దతునిచ్చాయో, అదేవిధంగా ఉత్పత్తి జరిగే ప్రదేశం వద్దే వినిమయం అనేభావన నేటి వ్యాపారానికి ఆధారంలోనూ, ఉపయోగంలోనూ రెండిటిలో మౌలికంగా భిన్నమైన స్థానిక వ్యాపారం అనే ఆలోచనను ముందుకు తెస్తోంది.

మన దైనందిన ఉపయోగంలో అవసరానికి వచ్చే అన్ని వస్తువులనూ మన చుట్టుపక్కల పల్లెల్లోనూ, పట్టణాలలోనూ కుగ్రామాలలోనూ మూల మూలలో ఉండే అంగళ్ళందిస్తాయి. పక్కనే ఉండే వృత్తిపనివారు, మేస్త్రీలు, ఉపయోగపడే రకరకాల వస్తువులను తయారుచేయడమే కాకుండా అనేక మరమ్మత్తు సేవలు అందిస్తారు. ఇంట్లోని మహిళలు పిల్లలనుండి పెద్దలవరకు అందరి ఆరోగ్యాన్ని కాపాడడానికి, జబ్బుపడినవారిని సంరక్షించడానికి తమకు తెలిసిన జ్ఞానంతో స్థానిక మందులు, ఆరోగ్య చిట్కాలు ఉపయోగిస్తారు. వారు అలా చేయలేనప్పుడు ఆరోగ్య, వైద్య సంరక్షణలోని వివిధ అంశాలలో నిపుణులైన, మేధావంతులైన స్థానిక సమాజంలోని నిపుణులు వారికి అందుబాటులో ఉంటారు. ఆవిధంగా దైనందిన జీవితావసరాలు పరస్పర సహకారము, స్థానిక మార్పిడి ద్వారా నెరవేరుతాయి. ఇది దోపిడీకి, అన్యాయానికి చాలా తక్కువ చోటిచ్చే స్వయం ఆధారిత సమాజం యొక్క రూపురేఖలు. ఈ సమాజ ఆర్థిక వ్యవస్థ యొక్క ఊతం స్థానిక వ్యాపారంలోనే ఉంది. సమయ కాలాలబట్టి స్థానిక వ్యాపారం అనేక రూపాలలో ఉండవచ్చు. కానీ సమాజంలోని సత్యం, అహింస, న్యాయం అనేవి ఆర్థిక వ్యవస్థలో స్థానికసమాజ వాటాకి అనుకూలంగా ఉంటాయి.

వాణిజ్య స్వభావం స్థానిక వ్యాపారానికి పూర్తిగా భిన్నమైనది. వాణిజ్యవేత్తలు వస్తువులను దూరప్రాంతాలనుండి తెచ్చి ఆ వస్తువులను చాలా విస్తృతంగా సుదూరప్రాంతాలలో అమ్ముతారు. ఈ రోజు మన అందరికీ ప్రపంచ విపణి తెలుసు. ఒక దేశంలోపల కూడా ముడిసరుకు, తయారుచేయబడిన వస్తువులు చాలాదూరాలు రవాణా చేయబడుతున్నాయి. ప్రపంచీకరణ పైబడటంతో, స్వేచ్ఛా వ్యాపారం పేరుతో విదేశీ వాణిజ్యాన్ని, దేశం లోపలనే ఉండే భారీ వ్యాపారాలను ప్రోత్సహించడానికి అన్ని రకాల రాయతీలు ఇస్తున్నారు. చిన్నా, పెద్దా అన్ని వ్యాపారాలలో దూరప్రాంత వస్తువులు ఆధిపత్యం చలాయిస్తున్నాయి. వృత్తిదారులు పనికోసం విధిలేక వలసలు పోతున్నారు. రైతులలోని ఒక వర్గం వారి ఉత్పత్తిని అంతర్జాతీయ విపణిలో అమ్మేందుకు చాలా ఉత్సుకతతో ఉన్నారు. దోపిడీ, అన్యాయం, నేరం, పేదరికం, నిరుద్యోగం, అవినీతి, అశ్లీలతలలో అసాధారణ పెరుగుదలకు వాణిజ్యంలోని ఈ విస్తరణ ఉపయోగించింది. ఈ స్థితిగతులకు వ్యతిరేకంగా ఒక పోరాటాన్ని చేసేందుకు, "లోక శక్తి"ని నిర్మించడానికి, "లోకవిద్య"కు పట్టం కట్టడానికి, "లోకనీతి"ని స్థాపించడానికి స్థానికవ్యాపారం యొక్క, వాణిజ్యం యొక్క విరుద్ధ పాత్రలను, స్వభావాలను అర్థంచేసుకోవడం, సమాజంలో సత్య, న్యాయ పాలనలను స్థాపించడంలో స్థానిక వ్యాపారం యొక్క పాత్రను అర్థం చేసుకోవడం ఆవశ్యకం. అందువలన వాణిజ్యం, స్థానిక వ్యాపారాల పాత్రలపై ఒక తులనాత్మక పరిశోధనను ఇవ్వడానికి ఈ క్రింది ఒక ప్రయత్నం జరిగింది.

**1) వినిమయ ఆధారం** : వినిమయానికి ముందు వస్తువులు దూరప్రాంతాలకు రవాణా అవ్వడం వాణిజ్యానికి ముఖ్య పునాది. వాణిజ్యంలో మార్పిడికి ముందు పనివాళ్ళు, పెట్టుబడి, ఉపయోగించే వస్తువులు, ప్రకృతినుండి పొందే వనరులవంటి సమస్తము దూరప్రాంతాలకు ప్రయాణంచేస్తాయి. ఒక సమాజపు వస్తువులు ఇంకొక సమాజంలో అమ్ముడుపోతాయి. అందువలన వినిమయ భాగస్వాములు చాలా భిన్నమైన సాంఘిక, ఆర్థిక విలువలు, కట్టుబాట్లు కలిగి ఉంటారు. ఆ కారణంగా కేవలం ఆర్థిక తర్కమే నిలుస్తుంది. న్యాయ సంబంధ ప్రశ్నలకు తరువాత స్థానమే. లాభాల పెంపుదలే వాణిజ్య ఉద్దేశ్యం కాబట్టి, అటువంటి వినిమయంలో బలాన్ని ఉపయోగించడమనేది అంతర్గతంగా ఉంటుంది. మధ్యయుగం, వలస రాజ్యాల శకంలో వాణిజ్యానికి రక్షణగా రక్షణ బలగాన్ని బాహాటంగా ఉపయోగించారు. దానికి పెట్టుబడిదారీ రాజ్యం కింద రాజ్యాంగ హోదా ఇవ్వబడింది. చట్టం పేరుతో, సైనిక, రక్షక బలగాల ద్వారా, ప్రభుత్వం అటువంటి నిర్బంధం అమలుచేస్తుంది. దీనికి విరుద్ధంగా స్థానిక వ్యాపారంలో వినిమయం సాంఘిక ఆర్థిక విలువల భాగస్వామ్యంతో కూడి ఉంటుంది. ఒకే ప్రదేశంలో జీవించే ప్రజలు అసంఖ్యాక సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, కుటుంబ సంబంధాలు కలిగి ఉంటారు. కనుక విరుద్ధ ప్రయోజనాలు సాధించుకోవడానికి బలాత్కారం కాని, నిర్బంధంకానీ అవసరంలేదు. ఈ రోజుకి కూడా చిన్న చిన్న దుకాణ దారులు వారి సమాజంలోని పేదవారికి వస్తువులమ్మేటప్పుడు తరచూ రాయతీలు ఇవ్వడం గమనించవచ్చు.

**2) దోపిడీనా లేక ధర్మమా?** : వాణిజ్యంలో ఉత్పత్తి వర్గం తప్ప మిగిలిన అందరూ దోపిడికి గురవుతారు. వస్తువులు ఉత్పత్తయ్యే లేక లభ్యమయ్యే ప్రదేశం నుండి దూరం వెళ్ళే కొద్దీ వినిమయం మరింత అసమానంగా ఉంటుందన్నది వాణిజ్యంలో ఒక నియమం. ఇంకొక్క మాటలో, అటువంటి వినిమయంలో శక్తివంతులైన భాగస్వాములు సింహభాగాన్ని నొక్కేస్తారు. నేటి వ్యాపారంలో లభ్యమయ్యే ఏ వస్తువు ధరనైనా చూడండి. పళ్ళపొడి, సబ్బు దగ్గరనుండి బియ్యం, గోధుమలు, బట్టలు, ఇతరవస్తువులు, ఏ వస్తువైనాసరే ధరలు అధికంగా పెంచేశారు. ఈ అధిక ధరలలో రైతులుగానీ, వృత్తిదార్లు గానీ ఎటువంటి భాగాన్ని పొందట్లేదు. నిజానికి వాళ్ళు వాళ్ళ ఉత్పత్తిని సాధ్యమైనంత తక్కువ ధరకు అమ్మే విధంగా నిర్బంధింపబడుతున్నారు. లాభమంతా పెద్ద వ్యాపారాలు, వ్యాపారవేత్తల చేతుల్లోకి పోతోంది. స్వేచ్ఛావిపణి, ప్రపంచీకరణ పేరుతో వ్యాపారాన్ని సమాజంలోని మూల మూలలకు విస్తరింపచేయడాన్ని ఈ రోజులాగా తీవ్రంగా ముందుకు తీసుకువెళ్తే, అది ఈ దోపిడీ వ్యవస్థను మరింత లోతుగా బలోపేతం చేస్తుంది. వ్యాపారం అనేది ఈ దోపిడీ స్వభావానికి భిన్నంగా స్థానిక సమాజం లాభపడడం స్థానిక వ్యాపార లక్ష్యం. కొత్త అవసరాలు, కోరికలు సృష్టించడం లేక కొత్త వస్తువులపైన ఆకర్షణ కల్పించడం స్థానిక వ్యాపార ఉద్దేశ్యం కాదు. దానిస్థానే స్థానిక ప్రజల అవసరాలను తృప్తిపరచడమే. ఒక సమాజంలో అవసరమైన అన్ని వస్తువులనూ ఎవరూ ఉత్పత్తి చేయలేరు. వినిమయ సంస్థల అవసరం ఏ సమాజంలోనైనా ఉంటుంది. స్థానిక వ్యాపారం అటువంటి సంస్థ. చిన్న చిన్న దుకాణాలను కలిగి ఉన్న ఈ వ్యాపారంలో ప్రజలకు అవసరమైన వస్తువులు, సేవలు అందుబాటు ధరలలో లభ్యమౌతాయి.

**3) గుత్తాధిపత్యం - స్థానిక లభ్యత** : వాణిజ్యం విస్తరించి దూరప్రాంతాలనుండి తీసుకువచ్చిన వస్తువులతో వ్యాపారం నిండిపోయినప్పుడు వస్తువుల లభ్యతలో వైవిధ్యం తగ్గిపోతుంది. ఒకవైపు సబ్బులు, నూనెలు, దంత సంరక్షణ వస్తువులు, ఆహారవస్తువులు, మిఠాయిలు, కుట్టితయారైన వస్త్రాలు, పాత్రలు, గృహోపకరణాలు వంటి వస్తువులలో ఉన్నత శ్రేణికి చెందిన ఖరీదైన, మెరిసే వస్తువుల లభ్యతలో వైవిధ్యం చాలా ఎక్కువగా ఉంది. ఇంకొకవైపు సామాన్య జనానికి చెందిన ఈ విభాగపు వస్తువుల లభ్యతలో వైవిధ్యం సగం కంటే తక్కువ ఉంది. దేశీయ, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణతో వస్తువుల లభ్యతలో వైవిధ్యం పెరిగిందని సంపన్నులు, ధనికులు వాదిస్తున్నారు. కానీ ఈ వస్తువుల ధరలు కనీసం 80% ప్రజలకు అందుబాటులో లేవు. వారికి అందుబాటులో ఉన్న వస్తువులలో ఎంపికకు ఎటువంటి అవకాశం లేదు. స్థానిక వ్యాపారంలోని ఒక ముఖ్య అంశం ఏమిటంటే వారికి నచ్చిన వస్తువులని ఎంచుకోవడానికి అందరికీ అవకాశం ఉంటుంది.

**4) మెరుపా లేక నాణ్యతా?** : స్థానిక ఉత్పత్తి కోసం స్థానిక వ్యాపారం అన్న ప్రశ్న లేవనెత్తినప్పుడల్లా సంపన్నులు నాణ్యతకు సంబంధించిన ప్రశ్న లేవనెత్తుతారు. అది ఆహారవస్తువులకు సంబంధించిన, లేక నూలు, లోహ, ప్లాస్టిక్ ఉత్పత్తుల ప్రశ్న కానీయండి భారీ వాణిజ్య సంస్థల ద్వారా ఆకర్షణీయమైన పొట్లం కట్టబడిన వస్తువులే అధికనాణ్యత కలిగి ఉంటాయని, స్థానికంగా ఉత్పత్తి చేయబడిన వస్తువులు ప్రామాణీకరింపబడవని, నాణ్యత విషయంలో సందిగ్ధత ఉంటుందని, కాబట్టి నమ్మలేమని వాదించడంలో అలసిపోరు. కానీ మనం మన సౌందర్య దృష్టిని, రుచిని కోల్పోయి, మెరిసే ప్రతిదాన్నీ, అతి సాధారణంగా ఉండికూడా ప్రదర్శన ఎక్కువగా ఉండేవాటిని అధిక నాణ్యతకు పర్యాయపదంగా భావిస్తే ఎవరు మాత్రం ఏం చెప్పగలరు. నాణ్యతా దృష్టిగా సమాజంలో ప్రామాణికాలను అమలుచేయడమనేది వినియోగదారుని పని. ఇది ఏ ప్రభుత్వ సంస్థలకు కానీ, వాణిజ్య సంస్థలలో అంతర్భాగంగా ఉండే ఇతర ఏ సంస్థలు లేక పరిశోధనాశాలలకు కానీ అప్పగించే పని కాదు. ఈ రోజు ఆకర్షణీయంగా పొట్లం కట్టడము, మెరవడం అనేవి నాణ్యతకు పర్యాయపదాలుగా మారాయి. ఏ సమాజ ఆరోగ్యం కోసమైనా అటువంటి అభివ్యక్తీకరణను ప్రదర్శనను సవాలు చేయడం అవసరం. కాబట్టి మనం వ్యాపారాన్ని ఎలా నిర్వహించాలంటే నాణ్యతను నిర్ణయించే హక్కు స్థానిక వినియోగదారుడే కలిగి ఉండేలా. స్థానిక వ్యాపారానిది ఖచ్చితంగా ఈ స్థితే.

**5) పోటీతో దివాళానా లేక పరస్పర ఆశ్రయంతో సహజీవనమా?** : స్వేచ్ఛా వాణిజ్య భావన యొక్క మూలం హద్దులు, పరిమితులు, మర్యాదలకు ఏ మాత్రం గౌరవమీయని పోటీ భావనలో ఉంది. ఇది "ఆర్థిక బలమే సరి అయనదనే" నియమం తప్పితే వేరేమి కాదు. వ్యాపార సంస్థలు ఒకరినొకరు నిర్మూలించే విధంగా పోరాటంలో నిమగ్నమౌతాయి. అధిక నాణ్యత కలిగిన వస్తువులు తక్కువ ధరకు అందేందుకు పోటీ ఒక ఆధారంగా ఉంటుందని వాదిస్తారు. స్వేచ్ఛావిపణి అందరికీ సమాన అవకాశలిస్తుందన్న వాదనలో ఎంత డొల్లతనమున్నదో ఈ వాదనలో కూడా అంతే డొల్లతనమున్నది. అది అందరికి సమానావకాశాలనివ్వడంకానీ, వస్తువులలో మంచి నాణ్యతను నిర్ధారించడంకానీ, వినియోగదారులందరికి వైవిధ్యాన్ని అందుబాటులోకి తేవడం కానీ, పోటీ ద్వారా వస్తువులన్నీ వీలైనంత చౌక ధరకు అందుబాటులో ఉండేటట్లు చేయడంకానీ చేయట్లేదు. అది పోటీ పేరుతో గుత్తాధిపత్యానికి అవకాశమీయడం, అసత్యపు ప్రచారం ద్వారా వాణిజ్యాన్ని వ్యాపారస్తుల చేతులలో ఒక తోలుబొమ్మలాగా మార్చడం. దీనిలో మెలకువ తెలియనివారు దివాళాతీయడం చూస్తున్నాం. దీనికి పూర్తి విరుద్ధంగా స్థానిక వ్యాపారం పోటీ కాకుండా పరస్పరాశ్రయంలో ఉంటుంది. ఒక స్వయం ఆధారిత సమాజానికి వేగవంతమైన, చురుకైన స్థానిక వ్యాపారం లక్షణంగా ఉంటుంది. ఇది ఎటువంటి ఆర్థిక వినిమయం జరిగే ప్రదేశం అంటే, అక్కడ ప్రతి ఒక్కరు వారి వారి స్వంత ఆర్థికచర్యలకు అనుగుణంగా ఆర్థిక పరస్పర సహకారాలతో అనుబంధం కలిగి ఉంటారు. ప్రతిమనిషిని ఒకపూర్తి ఏకవ్యక్తిగా పరిగణించి పోటీ అనేది అటువంటి పూర్తివ్యక్తులమధ్య అనే భావనగా వర్తక సిద్ధాంతముంటే, మానవుడు, కుటుంబము, గుంపు, గ్రామాలను స్వతంత్ర, పరస్పరాధారిత విభాగాలుగా పరిగణించే భావనమీద ఆధారపడిన స్థానిక వ్యాపారంలో ఒక సిద్ధాంతముంటుంది. కాబట్టి స్థానిక వ్యాపారం సమాజంలో సహకారం గూర్చిన భావరాగాలు పునర్నిర్మితమయ్యే విధంగా ఒక విశాల పునాదిని ఏర్పరుస్తుంది.

**6) వ్యాపారం అంటే నేరపూరిత ఉద్రిక్తతలా? - కలుపుగోలుతనమా?** : వాణిజ్యానికి, నేరానికి చాలా దగ్గర సంబంధముంది. నేర సామ్రాజ్యంలో దారిదోపిడీలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలు చాంతాడంత నేర చరిత్ర సృష్టించలేనివి నేటి వర్తక సమాజంలో చాలా తక్కువ సమయంలో కొత్త కొత్త నేరాలు ఉనికిలోకి వస్తున్నాయి. ముంబాయి, ఢిల్లీలోని చీకటి రాజ్యాలు అంతర్జాతీయ విపణిలో భాగం. వారి రక్షణలోకానీ, స్వతంత్రంగా కానీ, చిన్న, పెద్ద పట్టణాలలో, నగరాలలో నేరాలు నమ్మశక్యంగాకుండా పెరుగుతున్నాయి. ఇది పట్టణకేంద్రాలలోనే జరుగుతోంది. ఎందుకంటే వ్యాపారానికి, వాణిజ్యానికి కేంద్రాలు ఇక్కడే ఉన్నాయి. ఈ విశృంఖల పోటీ నేరంగా రూపుదిద్దుకొవడాన్ని ఎవరూ ఆపలేరు. వర్తకంగానీ, వర్తకులు కానీ, నేరస్తులని తప్పనిసరిగా వాడుకొంటారనికాదు. అత్యున్నతస్థాయిలో వాణిజ్యానికీ, నేరానికీ మధ్య వ్యత్యాసం చాలా తక్కువ. మనం ఆర్థిక నేరాలకు, ఇతర నేరాలకు మధ్య తేడాని చూపించకపోతే ఇది మనకు చాలా ఎక్కువగా స్పష్టమవుతుంది. అసత్యం, మోసం, నమ్మకద్రోహం, వంచన, కుట్ర, దొంగసంతకము, బందిపోటు దొంగతనము; హత్య వంటివన్ని ఒకదానితో ఇంకొకదానికి సంబంధముండి ఏదైనా సరే మిగిలినవాటిని ప్రేరేపించేటట్లుంటుంది. వర్తక ప్రపంచం వీటన్నిటికి స్థావరం. స్థానిక వ్యాపార నిర్మాణము, సమాజాన్ని ఈ వ్యాపారాన్నుండి, చాలా పెద్ద ఎత్తున ఈ నేరాలనుండి కూడా విముక్తి చేస్తుంది. స్థానిక వ్యాపారంలో విశృంఖల చర్యలకు చోటే ఉండదు. ఇంకా ఈ సంస్థ ద్వారా ప్రతీ ఒక్కరూ ఇంకొకరితో ఎలా కలపబడుతారంటే ఎవరైనా ఒకరికి నష్టం చేస్తే అది అందరి నష్టానికి దారి తీస్తుంది. ఇది నేరాల నడ్డివిరుస్తుంది. ప్రయోజనాలలోను, బాధలలోను ఒక సామాన్యతను తీసుకువచ్చే ఈ అమరిక సమాజంలోని ఇతరుల బాధను అర్థంచేసుకునేందుకు ఒక ఆర్థిక ఆధారాన్నిస్తుంది. కాబట్టి స్థానిక వ్యాపార భావనలో పరస్పరాశ్రయ సిద్ధాంతాన్ని పొందుపరచడమనేది ఒకరిమీద ఒకరికి సానుభూతి, జాలివంటి భావనలు కలిగేందుకు దారితీస్తుంది. కలుపుగోలుతనం యొక్క ఆధారం ఈ భావాలలోనే ఉంది. ఇంకా ఏ సమాజమూ కూడా ఇటువంటి సంకల్పము లేకుండా మనలేదు. ఇతరుల బాధలకు చలించే ఏ వ్యక్తి కూడా నేరం చేయలేడు. ఒక తులనాత్మక చట్రంలో, వర్తకాన్ని గూర్చి పైన జరిగిన చర్చ, నేటి పరిస్థితులలో దోపిడీ రహిత సమాజం కోసం స్థానిక వ్యాపారభావన ఒక సందేశాన్ని ఎలా తీసుకువస్తుందో చూపెడుతుంది. అయినప్పటికి ప్రపంచీకరణ సవాలుకు ఒక గట్టి ఆధారాన్నిచ్చే పోరాట స్వరూపాలని ఇంకా గుర్తించవలసి ఉంది. ప్రపంచీకరణను సవాలు చేసే ఈ పోరాటాలలో స్థానిక వ్యాపారం ఎలా ఒక కేంద్ర స్థానాన్ని ఆక్రమిస్తుందో నిరూపించవలసి ఉంది.

## III. మనముందున్న సవాళ్ళు

నేటి వ్యాపారం మూలంగా కొత్త దోపిడీ విధానాలు తలెత్తడంతో వాళ్ళ స్వంత శ్రమ, నైపుణ్యంతో బ్రతికే విభిన్న ఉత్పత్తి వర్గాల మధ్య తేడా చెరిగి పోతోంది. రైతుని, కూలీని, మహిళనూ, గిరిజనుడినీ, వృత్తిదారుడినీ అందరినీ ప్రపంచీకరణ ఒకే ఆర్థిక స్థితిలోకి నెట్టేస్తోంది. సాధారణంగా రైతు ఒక చిన్న భూమిని, వృత్తిదారుడు గృహ ఆధారిత పరిశ్రమకు సరిపోయే యంత్రాలు, సామాగ్రి, పనిముట్లను కలిగి ఉంటారు. ఇద్దరూ కూడా అప్పుమీద ఆధారపడతారు. కుటుంబ ఆధార శ్రమ, నైపుణ్యం, ప్రాకృతిక ప్రపంచ మరియు పదార్థ సంబంధ జ్ఞానం, నిర్వహణా సామర్థ్యాలతో వారు ఉత్పత్తిని చేపడుతారు. వారు ఉత్పత్తి చేసిన వస్తువులను వారి కుటుంబము, వర్గము నుండి వచ్చిన జనాలే అమ్మిపెడతారు. కానీ ఈ ప్రక్రియ మొత్తంలో లాభంలో ఉత్పత్తిదారు అనుమతిలేకుండా ఆవగింజంత కూడా వారు తీసుకోరు.

దీన్ని అర్థం చేసుకోవడానికి ఒక ఉదాహరణ తీసుకుందాము. 1998లో ఒక పెద్ద వంట నూనె కుంభకోణం జరిగింది. కల్తీ వంట నూనె వలన ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పబడింది. ప్యాక్ చేయబడిన వంటనూనెను అమ్మే కొన్ని పెద్ద వ్యాపారసంస్థలు ఈ కల్తీ చేస్తున్నట్టుగా ఆరోపించబడింది. అవి ఒప్పుకున్నాయి కూడా. ప్రభుత్వం దీన్ని "చాలా తీవ్రంగా" పరిగణించి, వంటనూనె ఉత్పత్తిని, వ్యాపారాన్ని నియంత్రించే ఒక చట్టాన్ని తెస్తున్నట్టుగా చెప్పారు. ప్యాక్ చేయబడని వంటనూనెను నిషేధించాలని కూడా సలహా ఇచ్చారు. తరువాత కొన్ని వారాలపాటు వంట నూనెను విడిగా అమ్మే చిన్న చిన్న అంగళ్ళమీద రక్షక

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. - 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. Telangana-500 060.

Date of posting 17 & 20 every month
**RNI Regd. No. APBIL/2012/50668**

Date of publication 15-2-2015
**Postal Regn. No. HSE/677/2013-2015**



బలగాల అణచివేతను స్వేచ్ఛగా వదిలివేశారు. నెమ్మదిగా పరిస్థితులు యధాతథంగా మారాయి. విడి వంటనూనె అమ్మకాలు, ప్యాక్ చేయబడిన వంటనూనె అమ్మకాలు మళ్ళీ వ్యాపారంలో అడుగుపెట్టాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ రాజకీయ పక్షం కూడా నిరసన గళం విప్పలేదు. ఇది దేన్ని సూచిస్తుందంటే - ఏ రకమైన వత్తిడులు, నిర్బంధాలున్నప్పటికీ, విడి వంటనూనెను నిషేధించి, ప్యాక్ చేయబడిన వంటనూనెను మాత్రమే వ్యాపారంలోకి అనుమతించాలన్న విషయంలో రాజకీయంగా ఏకాభిప్రాయం ఉండటాన్ని సూచిస్తుంది. ఇక్కడుండేది కోట్ల మంది ప్రజలమీద ప్రభావం చూపే, కోట్ల రూపాయలు చేతులు మారే అతి పెద్ద నిర్ణయం. అనివార్యంగా, దీనికి వ్యతిరేకంగా పెద్ద నిరసనలు తలెత్తుతాయి. దాంతోపాటే నిరాశా, విధ్వంసం, శిధిలం కూడా. పర్యవసానంగా ప్రభుత్వం నష్ట నివారణకు చర్యలు చేపడుతుంది. వ్యాపారంలో విడి నూనె అమ్మకాన్ని నిషేధించే ప్రతిపాదన అప్పుడే చేపట్టారు. ఇప్పుడు చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు.

రేపు రైతు ఈ విధంగా చెబుతాడు. "చూడండి! ఈ భూమి నాది. అందులో ఆవాలు, వేరుశనగ పండించాలని నిర్ణయించింది నేను. నేనే విత్తనాలు కొన్నా, పంట పండించేందుకు నేనూ, నాకుటుంబం గొడ్డు చాకిరి చేశాము. పక్కనున్న పట్టణంలో నా సోదరుడికి దుకాణం ఉంది. అందులో నూనె గానుగ యంత్రం పెట్టాడు. నేను పండించిన గింజల నుండి అతని గానుగలో నూనె తీస్తాడు. కానీ అట్లా తీసిన నూనెను నేరుగా అమ్మడానికి అతనికి అనుమతి లేదు. మూడు రోజులకొకసారి ఒక మెటాడోర్ వ్యాన్ వచ్చి మొత్తం నూనెను తీసుకువెడుతుంది. అదే నూనె ప్యాక్ చేయబడిన తరువాత మెటాడోర్ వ్యాన్ తిరిగి వస్తుంది. అప్పుడు నా సోదరుడు ఆ ప్యాక్ చేయబడిన నూనెను తన దుకాణంలో అమ్ముతాడు. ఇప్పుడు నాకు దయచేసి వివరించండి. నూనెను ప్యాక్ చేసి అమ్మే కంపెనీ యజమానికి నగరంలో చాలా భవనాలున్నాయి. అతని పిల్లలు చాలా ఖరీదైన విద్యాలయాలలో చదువుతారు. ఆడంబరంగా వస్త్రధారణ కలిగి ఉంటారు. నేనేమో అప్పులలో కూరుకుపోతున్నాను. నా పిల్లలు బడికి, కళాశాలలకీ వెళ్ళలేరు. నా కుటుంబ సభ్యులకు కనీసం వైద్య సదుపాయాలు కూడా కల్పించలేను. నా సోదరుడు కూడా నాకంటే పెద్దగా సంపాదించలేదు. ఇదేమి ఆర్థిక వ్యవస్థ?"

చాకిరీ చేసే వృత్తిదారుడికి కూడా ఇదే కథ పునరావృతమౌతుంది. అతనికి స్వంత పాక, పనిముట్లు ఉండి, తన కుటుంబంలోని వాళ్ళచేత పనిచేయిస్తాడు. అతనుపయోగించే కలప, మన్ను, ఇనుము, గాజు, పత్తి, నూలు, ప్లాస్టిక్ వంటి అసంఖ్యాకమైన పదార్థాలన్నీ అతని స్వంతమే. కాని వాటిని అమ్ముకునే విధానాలపైన అతనికి నియంత్రణ ఉండదు. కొనుగోలు, అమ్మకపు ప్రక్రియలన్నిటిలోను అతను నష్టపోతాడు.

స్థానిక వ్యాపార భావన ఎటువంటి మార్పిడి విధానానికి చెందుతుందంటే, అక్కడ అన్యాయమైన నియంత్రణ జరగదు. నూనె వ్యాపారంలోని లాభాన్నంతా నూనె ప్యాక్ చేసే కంపెనీలే దండుకోవు, వృత్తిదారుల శ్రమలోని లాభాన్నంతా వ్యాపారవేత్తలు, ఆర్థిక సంస్థలే నొక్కేయవు. ఇది జరగడానికి ఉన్న ఒకే మార్గమేమిటంటే స్థానిక సమాజాలు స్థానిక వ్యాపారాల మీద నియంత్రణ సాధించి, వాటినుండి వర్తకాన్ని తరిమేసి వ్యాపారాన్ని పునర్నిర్మించాలి. ప్రపంచీకరణకు ఒక నిర్ణాయాత్మక సవాలును నిర్మించడానికి స్థానిక వ్యాపారాల పై స్థానిక సమాజాల నియంత్రణ పెంచుకోవడం, స్థానిక వ్యాపారాలను పునర్నిర్మించడమే ముఖ్య విధానంగా వుండాలి.

గ్రామాలు, పట్టణాలు, ఇంకా అనేక నగరాలున్న దేశం భారతదేశం. ఇక్కడుండే ఏ నివాసి దగ్గరకైన వెళ్ళండి, ఎక్కువమంది వ్యవసాయం, చేతివృత్తులు, గృహపరిశ్రమలలో నిమగ్నమై కనిపిస్తాయి. తమ స్వంత చిన్న కమతాలను సాగు చేసుకొనే రైతులు, గృహ ఆధారిత వృత్తిదార్లు-వ్యవసాయ, పరిశ్రమల కార్మికుల ప్రతినిధులు. వీరితో సంబంధముండి, నేటి వర్తకుల కబంధ హస్తాలలో చిక్కుకుపోయిన చిన్న వ్యాపారస్తులు. వీరు వీరి కుటుంబ సభ్యులతో కూడా కలిసినదే స్థానిక సమాజం. ప్రభుత్వ ఉద్యోగులు, భారీ పరిశ్రమలలోని వృత్తి నిపుణులు, విద్యాలయాలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలోని ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, ఆచార్యులు ఈ స్థానిక సమాజ అవసరాల గురించి చెప్పరు. వాటి గురించి పనిచేయరు. ఈ ప్రపంచీకరణ శకంలో వృత్తిదారులు, రైతుల అవసరాలలో ఎంతగా సారూప్యత ఉందంటే స్థానిక సమాజ ఐక్యతకు ఇది ఒక సహజమైన పునాదిని ఏర్పరుస్తోంది. ప్రపంచీకరణను సవాలు చేయడానికి, స్థానిక వ్యాపారాల పునర్నిర్మాణానికోసం వాటిని లోబరుచుకోవడానికి, ఈ స్థానిక సమాజాల ఐక్యత ఒక అత్యవసర ముందస్తు నియమం. కేవలం స్వతంత్ర స్థానిక విభాగాలను కలిగివున్న సమాజానికే సమాజంలోని దోపిడీ నుండి విముక్తయిన, ప్రజలకు గౌరవాన్ని, న్యాయాన్ని అందించేశక్తి వుంటుంది. స్వతంత్ర స్థానిక సమాజాన్ని నిర్వచించే స్వభావలక్షణమే స్థానిక వ్యాపారం.

ఏ సమాజంలోనైనా సరే విభిన్న జీవన రీతులు, వర్గాలు, వృత్తులు, సమూహాల నుండి వచ్చిన ప్రజలు ఉద్యమాల సమయంలో ఒకచోటికి వచ్చి వారి కోరికలకు సమర్థనగా ఆందోళన చేపట్టేట్టుగా నిర్బంధించబడతారు. ఎందుకంటే వీరందరూ ఒకేరకమైన బలహీనతలతో బాధపడుతున్నారు. అటువంటి ఉద్యమాలకు ఉదాహరణలు- భూమిపై యాజమాన్య హక్కుకోసం కౌలుదారులు, పంట భాగస్వాములు చేపట్టిన ఉద్యమం; వ్యవసాయ ఉత్పత్తుల గిట్టుబాటుధర కోసం రైతుల ఉద్యమం; మెరుగైన పనివాతావరణం, వేతన పెరుగుదల కోసం వ్యవసాయ పారిశ్రామిక కార్మికుల ఉద్యమం; పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా పట్టణ మధ్యతరగతి వారి ఉద్యమం; విద్యా సంస్కరణలు, ఉద్యోగాల కోసం విద్యార్థుల ఉద్యమాలు; గౌరవం, రక్షణ, సామాజిక గుర్తింపు కోసం మహిళల ఉద్యమాలు; గిరిజనులు "అడవులను రక్షించండి" ఉద్యమాలు; నిర్వాసితుల ఆనకట్ట వ్యతిరేక ఉద్యమాలు; సామాజిక న్యాయం కోసం వెనుకబడిన తరగతుల ఉద్యమాలు వంటివి. ఈ ఉద్యమాలన్నిటికి సాక్షిగా ఈదేశం వుంది. వీరు కోరుతున్న కోరికలన్నీ న్యాయమైనవే. అయినప్పటికి, ఈ ఉద్యమాలన్నిటినీ అత్యంత నిజాయితీతోను, దయతోను లోతుగా పరిశీలించినట్లయితే ఈ ఉద్యమాలన్నీ ఏదీ గూడా వ్యాపారస్తులు, పెట్టుబడిదారులు ఆధిపత్యం చెలాయించే ఈ ఆర్థిక వ్యవస్థకు, వలసవాద దోపిడీకి తీవ్రమైన సవాలును విసురుతాయి. ఇంకా అటువంటి సవాలు కనుక ఏదైనా వుండివుంటే, దానిని ఇవి బలపరచడము, పూరించడము చేస్తాయని విశదమౌతుంది.

స్వాతంత్ర్యం కోసం జాతీయ ఉద్యమాలు జరిగిన సమయంలో వలసవాదానికి నాలుగు రకాల సవాళ్ళు ఎదురయ్యాయి. మొదటిది జాతీయ స్వాతంత్ర్యోద్యమం; రెండవది ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ఆధారం చేసుకున్న గాంధీజీ స్వరాజ్ ఉద్యమం; మూడవది కమ్యూనిష్టు ఉద్యమం; నాల్గవది ముస్లింల ఉద్యమాలు. ఈ నాలుగు ఉద్యమాల మధ్య ఉన్న అనుకూలతలకు అనుగుణంగా వలసవాద వ్యతిరేక సవాలు తన బలాన్ని పొందింది. ఇప్పుడు ఈ దేశంలో వలసవాదానికి సవాలు విసరడానికి జాతీయ స్వాతంత్ర్యోద్యమం కానీ, ముస్లిం ఉద్యమం కానీ ఎంతమాత్రము ఉచితమైనవి కావు. గాంధీజీ, మార్క్స్ కలలను సాకారం చేసుకోవడానికి స్థానిక వ్యాపార భావననే ఒక ఆధారంగా చూడాలి. ప్రపంచీకరణ పేరుతో వున్న నేటి వలస వాదానికి స్థానిక వ్యాపారం విసిరే సవాలు ఒక న్యాయబద్ధమైన పోరాటంలో సమాజంలోని వర్గాలన్నిటిని పునరుత్తేజింపచేసి అటువంటి అన్ని వర్గాలనుండి జవసత్వాలు పొందడం.

స్థానిక సర్దుబాట్ల ద్వారా ఆహార, నూలు ఉత్పత్తులు విభాగాలను స్త్రీలకు మాత్రమే కేటాయించాలనే కోరిక ఒకవైపు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉద్యమానికి స్వాతంత్ర్యానంతరపు కొనసాగింపుగా ఉంటూ, ఇంకోవైపు స్థానిక సమాజాల ద్వారా స్థానిక వ్యాపారాల నియంత్రణ, పునర్నిర్మాణ ప్రక్రియలో సమాన భాగాన్ని కలిగి ఉంటుంది. రైతుల, వృత్తిదార్ల ఐక్యతా నేపథ్యంలో మహిళా ఉద్యమాలలో స్థానిక వ్యాపారం కీలకంగా మారుతుంది. బహుళజాతి సంస్థలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాల సహజమైన ఆసరాను కూడా ఇవి దొరకపుచ్చుకుంటాయి. బహుళజాతి సంస్థలకు వ్యతిరేకతకు విస్తృత వ్యక్తీకరణే వాటి వస్తు బహిష్కరణ. దూరప్రాంత నుండి వచ్చే నిత్యావసర వస్తువులను బహిష్కరించడం ద్వారా ఈ వ్యతిరేకతను మరింత విస్తృతంగానూ, లోతుగాను చేయవచ్చు. అప్పుడది స్థానిక వ్యాపార ఆందోళనలో భాగంగా మారుతుంది. ఈ రోజు వ్యాపారాలన్నీ బయటి ప్రాంతాల నుండి వచ్చే వస్తువులతో నిండిపోతున్నాయి. గడచిన మూడు నాలుగు దశాబ్దాలుగా అన్ని రకాల వస్తువుల స్థానిక ఉత్పత్తి ఆగిపోయింది. దూరప్రాంతం నుండి వచ్చే వస్తువులను బహిష్కరించడం ఒకసారి జరిగితే అటువంటి వస్తువుల స్థానిక ఉత్పత్తి తిరిగి ప్రారంభమవ్వడానికి కేవలం కొన్ని వారాలు లేక కొన్ని నెలలు మాత్రమే పడుతుంది. నిజానికి స్థానిక వ్యాపారమనేది పేదప్రజల విస్తృతమైన సంపదకు, క్రియాశీలతకు, సృజనాత్మకతకు దిక్సూచి.

ఈ నేపథ్యంలో ఇంకొక ముఖ్యమైన పరిణామం మీద కేంద్రీకరించడం అవసరం. ఎందుకంటే అది స్థానిక వ్యాపార ఉద్యమానికి ఒక ముఖ్యమైన నాందీ ప్రస్తావననిస్తుంది. మనమిప్పుడు సూచించేది. పేవ్‌మెంట్లు, దారిపక్కల, పట్టణ ప్రాంత బస్తీల నుండి చిన్న చిన్న దుకాణాలని, బడ్డీ కొట్లను, తోపుడుబళ్ళవారిని బలవంతంగా తొలగించాలని పౌర పరిపాలనాశాఖ తీసుకున్న నిర్ణయం గురించి. ఇది దేశమంతా జరుగుతున్న అతి పెద్ద నిర్వాసిత కార్యక్రమం. ఇతర తృతీయ ప్రపంచదేశాలలో కూడా ఇది జరగడానికి అవకాశముంది. ఈ పరిణామం యొక్క అన్ని అంశాలు రాజకీయ అంశం, మానవ హక్కుల కోణం, పట్టణ ప్రణాళిక, బ్రతుకు తెరువు సాధనాలు, స్థానభ్రంశం, వ్యాపారాంశాలన్నీ కూడా ముఖ్యమైనవి. మనమిక్కడ వ్యాపారాంశాల మీద మాత్రమే క్లుప్తంగా వ్యాఖ్యానించాలి. కాలిబాటలపై జరిగే వ్యాపారమంతా అంగడ్లకు తరలివెళ్ళిపోవడం మనకు స్పష్టంగ కనిపించే మొదటి విషయం. ఇది పెద్ద మొత్తాలలో జరుగుతోంది. రూ. 200 మించని వ్యాపారం చేసే 20000 బడ్డీ కొట్లు, వీధి వ్యాపారాలని నిర్మూలిస్తే మొత్తంగా రూ. 150 కోట్ల విలువచేసే వ్యాపారానికి మంగళం పాడినట్టు అర్థం. ఈ వ్యాపారం పెద్ద దుకాణాలకు తరలినప్పుడు అది రూ. 200-250 కోట్లుగా మారుతుంది. ఇంకా నగదు మార్పిడి మీద పెట్టుబడి, ఇతర వ్యాపార సంబంధ అంశాలమీద దీని ప్రభావం ధనిక, వాణిజ్యవర్గాల ఆసక్తులను మాత్రమే పెంపొందిస్తుంది. ఎవరైతే ఆ విధంగా నాశనమయ్యారో. వారు చౌక నైపుణ్యమున్న శ్రామికుల జాబితాలో చేరుతారు. రెండవ ముఖ్యమైన అంశమేమిటంటే, పట్టణ వ్యాపారంలోని ఈ "కాలిబాట వ్యాపారాలు" ఎక్కువభాగం వాణిజ్య నియమాలు పాటించనివే. ఎందువలన అంటే వీధి వ్యాపారస్తులు వారి పరిసర ప్రజలతో దగ్గరగా సంబంధం ఉండి, పేద ప్రజల కష్టనష్టాలన్నీ కూడా అనుభవించి ఉంటారు. కాబట్టి పర్యవసానంగా పట్టణ వ్యాపారంలో స్థానిక వ్యాపారం క్రియాశీలంగా ఉండిపోతుంది.

గ్రామీణ వ్యాపారాలు, వారాంతపు వ్యాపారాలు, సంతలు అనేక మార్గాలలో స్థానిక వ్యాపారానికి సంప్రదాయ రూపాలే. కానీ స్థానిక వ్యాపార భౌతిక రీతులను వ్యక్తీకరించేందుకు పరిమితులున్నాయి. మనం ఇంతకుముందు ఈ వ్యాసంలో ప్రయత్నించినట్టుగ స్థానిక వ్యాపార స్వభావ విశిష్టలక్షణాలను వాణిజ్య వ్యత్యాసంతో మరింత బాగా అర్థం చేసుకోవచ్చు. అందువలన పట్టణ ప్రాంతాలలో చేపట్టిన ఈ నిర్మూలన, విధ్వంస చర్యలు, అనేక మార్గాలలో వాణిజ్యాన్ని సవాలు చేసేందుకు అవకాశమున్న వ్యాపార నాణ్యతా స్వరూపాల నిర్మూలనా లక్ష్యంగా ఉంటాయి.

బలమైన రక్షక బలగాల పర్యవేక్షణలో ఈ విధ్వంస చర్య అన్ని ప్రాంతాలలో నిర్వహించబడుతోంది. ఏ నిరసనైనా సరే వెనువెంటనే అణచివేయబడుతోంది. ఇందులో చాలా ముఖ్యమైనదీ సహజమైనదీ ఏమిటంటే ప్రతి చోటా గూడా ప్రభుత్వదళాలు వ్యతిరేకతను ఎదుర్కోవడం, చాలా సార్లు ఉద్యమాన్ని వెనక్కు తీసుకోబడటం, ఈ వ్యాపారస్తులు, వృత్తిదారులు, శ్రామికులందరూ స్థానిక వ్యాపారం క్రింద వ్యవస్థీకరించబడితే తప్ప ఈ వ్యతిరేకత అవ్యవస్థీకృతంగాను, ఛిన్నా భిన్నంగాను, ఒంటిరిగాను ఉండిపోతుంది. ఈ నిర్మూలనా కార్యక్రమం ప్రతి పేదవాడి ఇంటిని తట్టే ప్రపంచీకరణ యొక్క కొట్టొచ్చినట్టు కనబడే రూపం. పేదవాడిని, కొన్నిసార్లు వాడుకొని, తరువాత గాలికి వదిలివేసి యంత్రంలోని పళ్ళచక్రంలాగా మార్చే ఈ చర్యలకు స్థానిక వ్యాపారం ఒక జవాబు. ఇలా నిర్మించిన ఈ సవాలుకు ప్రపంచీకరణ రథచక్రాలను వెనక్కుతిప్ప గలిగే సామర్థ్యముంది.

**- సునీల్ సహస్రబుద్దే**

**అనువాదం : పి. క్రిష్ణప్రసాద్**

**ఈ వ్యాసం ఒక పుస్తకరూపంలో కూడా అందుబాటులో ఉంది.**

**ఈ పత్రికలోని వ్యాసాలు యధాతథంగా పునఃప్రచురణ హక్కులు అందరివి.**

**తక్షణ సహాయం కొరకు ప్రకటన :**

**లోకవిద్య ప్రపంచం 2012, జనవరి నుండి క్రమం తప్పకుండా ప్రతినెల ప్రచురిస్తున్నాం. పత్రిక తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉంది. కావున చందాదారులు, అభిమానులు పత్రికకు తక్షణం ఆర్థిక సహాయం అందచేసి, సహకరించాలని విజ్ఞప్తి.**

-ఎడిటర్ లోకవిద్య ప్రపంచం

A/c No. SBH. 62222079499, గడ్డిఅన్నారం బ్రాంచి, హైదరాబాద్

మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన
వెబ్ పేజీ : Loka Vidya blogspot vidyaashram
**http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.**
**http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf**

వ్యాసాలు, ఉద్యమ వార్తలు కాపీల కోసం పంపించవలసిన చిరునామా :
**Loka Vidya Prapancham**
**D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters,**
**Saroornagar (M), R.R. Dist. Telangana- 500 060 Ph : 040-24152155**
**e-mail : tnrkoundinyasa@yahoo.com**

**BOOK - POST PRINTED MATTER**
**15 FEBRUARY - 2015**

**To**

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. - 60
**Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. Telangana-500 060.**